విజయవాడ వార్త



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ్యుల క్రీడాపోటీలుగురువారంతో ముగిశాయి. క్రికెట్, టెన్నిస్, మ్యూజికల్ ఛైర్స్ పోటీలలోశాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువారం నాటిపోటీలలో మహిళా సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఆకర్షణీయంగా సాగాయి.మహిళల క్రికెట్ పోటీలలో హోం మంత్రి అనిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.జావెలిన్ త్రో, షాట్ పుట్ వంటి క్రీడలలోనూ మహిళా ఎమ్మెల్యేలుపాల్గొన్నారు.
(విజయవాడ,- ప్రభాతవార్త)

## నెమలి బ్రహ్మోత్సవాలకు కలెక్టర్ లక్ష్మీశకు ఆహ్వానం

**గంపలగూడెం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం, నెమలి గ్రామములో వేంచేసి వున్న శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీ శా కు ఆహ్వానం అందించినట్లు నెమలి శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ సహాయ కమిషనర్, మరియు కార్యనిర్వహణాధికారి ఎన్ సంధ్య తెలిపారు. గురువారం విజయవాడ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీ శా ను కలిసిన ఏసీ స్వామి వారి చిత్రపటాన్ని అందించి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈనెల 28 నుంచి మార్చి 05 వరకు శ్రీ స్వామివారి వార్షిక



బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో కృష్ణా ఖమ్మం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానునందున భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు కూడా చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. యావన్మంది భక్తులు ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## జనసేన సభ్యత్వాలు ప్రారంభం

**గంపలగూడెం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలంలో గురువారం నుంచి జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా సభ్యత్వ నమోదు



వేగవంతం చేసేందుకు 20 మందికి జనసేన పార్టీ బాధ్యతలు అప్పగించినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చింతలపాటి వెంకటకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎంపికైన సాదిక్ లు గ్రామాల్లో సభ్యత్వాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు సంబంధిత వివరాలతో కూడిన కరపత్రాలు విడుదల చేశారు.

## మార్చి 1,2 తేదీలలో.
## శ్రీ అచ్చం పేరంటాడ్ల అమ్మవారి తిరునాళ్ళు

**గంపలగూడెం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం వినగడప గ్రామంలో ఉన్న శ్రీ అచ్చం పేరంటాల అమ్మవారి తిరునాళ్ళ జాతర మార్చి1,2 తేదీలలో జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫస్ట్ తారీఖు ఆదివారం ఉదయం 6 గంటల నుండి దారుణపాకతో మొదలై అమ్మవారికి అభిషేకం అలంకరణ. రాత్రి 7 గంటల నుండి ప్రభ ఊరేగింపు జరుగుతుందని, రెండో రోజు సోమవారం జాతర (తిరునాళ్ళ) సందర్భంగా భక్తులకు అన్నదానం జరుగుతుందని, వినగడప పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.



## శుభ్రమైన తాగునీరు అందుతుందా లేదా నిర్ధారించుకోవాలి : చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఎమినిటీ సెక్రటరీలు,అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రతి రోజు తమ వార్డుల్తో తమ తమ సెక్రటేరియట్ పరిధుల్లో నీటి పరీక్షలు ఖచ్చితంగా నిర్వహించి శుభప్రదమైన త్రాగునీరు అందుతుందా లేదా అని నిర్ధారించుకోవలని ఇంఛార్జి ఛీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి పేర్కొన్నారు. గురువారం ఉదయం ఇంజనీరింగ్ సిబ్బందితో ఆమె టెలికాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి రోజు నీటి పరీక్షలను నిర్వహించాలన్నారు. ఎక్కడైనా త్రాగునీరు కలుషితం అవుతుందన్న సందేహం ఉన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి కేవలం శుభ్రమైన త్రాగునీరే ప్రజలకు అందేటట్లు ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. .ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,డిప్యూటీ ఇంజనీర్లు క్రమం తప్పకుండా నిర్ణీత సమయాల్లో వాటర్ ట్యాంకులు కడగటం,స్వవరింగ్‌లు చేసేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులు ఎప్పుడికప్పుడు చేస్తూనే ఉండాలని, కాలువల ప్రవాహంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా తమ తమ పరిధిలో వారు తీసుకుంటున్న చర్యలపై ఒక ప్రణాళికలను సిద్ధం చేసి త్రాగునీటిలో ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా చేయడానికి ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేశారు వంటి విషయాలపై నివేదికను సమర్పించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

## రాజధానికి అనుసంధానంగా
# జాతీయ రహదారుల విస్తరణ
### ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై భాగస్వాముల సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్

**విజయవాడ, ఫిబ్రవరి 26(ప్రభాతవార్త) :** రాష్ట్ర నూతన రాజధాని అమరావతి, విజయవాడ నగర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారులను అభివృద్ధి చేయడం ముఖ్యమని, అందుకు అనుగుణంగానే జాతీయరహదారి65 విస్తరణ ఉండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సూచించారు. జాతీయ రహదారి ప్రాజెక్టులపై



భాగస్వాముల (స్టేక్‌హోల్డర్స్) సమావేశం గురువారం విజయవాడ కలెక్టరేట్, శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. జాతీయ రహదారులు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ తదితర శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు బోడె ప్రసాద్, వసంత వెంకట కృష్ణప్రసాద్, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, గద్దె రామ్మోహన్‌రావు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం - విజయవాడ హైదరాబాద్ నం.65 ఆరు వరుసల విస్తరణకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. విస్తృత ప్రజాప్రయోజనాలతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విస్తరణ పనులు చేపట్టాల్సి ఉందని గౌరవ ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. రైతుల ప్రయోజనాలకు ఇబ్బందిలేకుండా పనులు జరగాల్సి ఉందన్నారు.

సమావేశం అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ రెండు రాష్ట్రాలకు సంబంధించిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో పాటు గౌరవ ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్ విజయవాడమచిలీపట్నం జాతీయరహదారి విస్తరణకు సంబంధించి కొంతవరకు డీపీఆర్ తయారైందని, ఈ డీపీఆర్‌ను పరిశీలించిన మీదట ఎక్కువ మంది రైతులు ఇబ్బందిపడే అవకాశమున్నందున విస్తరణలో ప్రతిపాదించిన రెండు బైపాసులు (అంబారుపేటఐతవరం; కాచవరం మూలపాడుఇబ్రహీంపట్నం వెస్ట్) బదులు పాత రహదారినే పటిష్ట ప్రణాళికతో విస్తరణతో అభివృద్ధి చేయాలని తీర్మానించామన్నారు. సూర్యాపేట, నకిరేకల్ తరహాలో ఎక్కడైనా ఊర్ల గుండా వెళితే ఆయా ప్రాంతాల్లో పై వంతెనలు వేస్తూ పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. విజయవాడ నగరంలో కనకదుర్గమ్మ వారి ఫ్లై ఓవర్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు అదేవిధంగా బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు వరకు ఆరు వరుసల ఫ్లై ఓవర్లు వేయాల్సి ఉందన్నారు. నగరంలోని అమెరికన్ హాస్పిటల్, వైవీ రావు హాస్పిటల్ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిని బందరు రోడ్డుకు (ఎంజీ రోడ్డు)కు అనుసంధానించడం కూడా ముఖ్యమన్నారు. గొల్లపూడిజక్కంపూడి కాలనీ వరకు ఉన్న జాతీయ రహదారి బైపాస్ కు సంబంధించి 3.5 కి.మీ. మేర సర్వీసు రోడ్డు ఇవ్వమని కోరుతున్నామని, దీనివల్ల ఎన్‌హెచ్ 16, ఎన్‌హెచ్ 65, నాగపూర్ హైవేలకు అనుసంధానానికి దోహదం చేస్తుందని వివరించారు. ఎన్‌హెచ్ 65, ఎన్‌హెచ్ 16 కలిసే చోట ఒక క్లోవర్ లీఫ్ అవసరమని పేర్కొన్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతో నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి, నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. రాబోయే కాలంలో చక్కటి జాతీయ రహదారుల నెట్వర్క్ ఉండేలా చొరవ చూపనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సమావేశంలో ఎన్‌హెచ్ పీడీ (విజయవాడ) ఎం.విద్యాసాగర్, ఎన్‌హెచ్ పీడీ (హైదరాబాద్) సీహెచ్ శ్రీనివాసరావు, పీడీ (అమరావతి) టి.పార్వతీశం, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పటిష్ట భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు

**విజయవాడ, ఫిబ్రవరి 26,(ప్రభాతవార్త) :** ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించినప్పటికి అధికారులు నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందిస్తున్నామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీ శ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ సీఈవో, ఈవీఎంల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, కందుల పరమేశ్వరరావు (ఆమ్ ఆద్మీ పార్టీ), జె.శ్రీనివాసరావు (జనసేన), బి.కృష్ణారెడ్డి (బీజేపీ), సురేష్ సిపిఐ (ఎం), కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటి తహశీల్దార్ ఎ.ఎస్.ఆర్ గోపాల రెడ్డి తదితరులు ఉన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి వేగవంతం

**పెనమలూరు ఫిబ్రవరి26,ప్రభాతవార్త :** నియోజకవర్గంలో 2.50కోట్ల అభివృద్ధి పనులకు గురువారం పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ శంకుస్థాపన చేసారు.పెనమలూరు మండలంలో గోసాల,వణుకూరు,గంగూరు గ్రామాలలో సుమారు 2.50లక్షల నిధులతో చేపట్టబోయే రోడ్డుల నిర్మాణ పనులను ప్రత్యేకపూజ



నిర్వహించి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గమనిస్తే కూటమి ప్రభుత్వం పాలనలోనే గ్రామాభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తవుతున్నాయని తెలిపారు.గంగూరు వేల్పూరు కనెక్టివిటీ రోడ్డు వేల్పూరు వరకు 60లక్షల నిధులతో,గోసాల సాయిబాబాగుడికట్టరోడ్డు 50లక్షల నిధులతో,వణుకూరు లేఔట్‌లో 1.33లక్షల నిధులతో రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.సంవత్సరన్నర కాలంలో గ్రామంలో 4కోట్ల అభివృద్ధి పనులు చేసామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్30పై రంబుల్ స్టిక్స్ ఏర్పాటుతో డ్రైవర్లకు ఏకాగ్రత..
### - రాత్రిపూట గేదెలు సంచరిస్తే కేసులు జరిమానా.. ఎస్సై గంధం ఫ్లోరింగ్

**ఎ కొండూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మైలవరం ఎ కొండూరు తిరువూరు మీదుగా జగదల్‌పూర్ జాతీయ రహదారి-30పై మండలంలో ఎ కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్ముడు ఎన్‌హెచ్-30 ఉన్నతాధికారులతో మాట్లాడి జాతీయ



రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టిన పనులు ప్రమాదాలు జరక్కుండా బాగా సత్ఫలితాలు ఇస్తున్నాయని తిరువూరు నియోజకవర్గ ప్రాంత ప్రజలు వాహన చోదకులు ఎస్సై మహాలక్ష్ముడు కృషిని అభినందిస్తున్నారు. ఈ జాతీయ రహదారి-30పై రంబుల్ స్టిక్స్ రేడియం స్టికర్లు స్టాపర్లు తదితర ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌పై వాహన చోదకుల ఏకాగ్రతకు ప్రమాదాలకు తావివ్వకుండా తగు జాగ్రత్తల కొరకు వాహన చోదకులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ వాహనాలు నడపటానికి ఈ జాతీయ రహదారిపై ఏర్పటు చేసి పై విధానం ఎంతో ఉపకరంగా ఉంటాయని ఎస్సై తెలిపారు. అలాగే జాతీయ రహదారి-30పై రాబోయే ఎండాకాలంలో పశువులు ముఖ్యంగా గేదెల యజమానులు తమ గేదెలను రాత్రిపూట జాతీయ రహదారిపై సంచరించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈ గేదెల వల్ల గతంలో ఈ రహదారిపై ఈ మండలంలో సుమారు 5 నుండి 6గురు ద్విచక్రవాహన చోదకులు రహదారి ప్రమాదాలకు గురై మృత్యువాత పడ్డారని ఎస్సై తెలిపారు. రాత్రిపూట గేదెలు రహదారిపై రాకుండా యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆ గేదెల యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఎస్సై గంధం మహాలక్ష్ముడు హెచ్చరించారు.

## నేడు కంకిపాడు సిఎం రాక

**కంకిపాడు ఫిబ్రవరి26,ప్రభాతవార్త :** ఈనెల 27వతేదీన రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కంకిపాడు మండలంలోని ఆయాన కళ్యాణమండపంకు విచ్చేయనున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లాఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు



అధికారులను ఆదేశించారు.గురువారం ఎస్పీ,సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్‌తో కలసి ఫంక్షన్‌హాలులోని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్నారని తెలిపారు.ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో వాహనశ్రేణి రాకపోకలకు ఆటంకం కలుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.సి.సి.కెమెరాలు, అగ్నిమాపకసిబ్బందిని, విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు.ఈ పర్యటనలో కేఆర్‌ఆర్‌సిఎస్‌డిసి శ్రీదేవి,అదనపు ఎస్పీ సత్యనారాయణ,ఐఎస్‌బిడిఎస్‌పి మరియన్‌రాజు,అగ్నిమాపక అధికారి ఏసురత్నం,డిఎంహెచ్‌ఓ యుగంధర్,ఆహార తనిఖీ అధికారి గోపాలకృష్ణ,సిపిడిసిఎల్ ఈఈ హరిబాబు,డిఎస్‌పి శ్రీనివాసరావు,వెంకటేశ్వరరావు,సిఐ మురళీకృష్ణ,అధికారులు పాల్గొన్నారు.

## వేగవంతంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

**తిరువూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** తిరువూరు మండలం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మరియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు ఉద్యమి సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం తిరువూరు మండల అధ్యక్షులు పరసా పుల్లారావు అధ్యక్షతన మునుకుళ్ళ గ్రామంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరువూరు జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమానికి తిరువూరు పట్టణ మరియు మండల నాయకులు(సాధక్) హాజరయ్యారు. తిరువూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ



సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా, పార్టీ సూచనలు మేరకు విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు తెలియజేశారు.

## విజయవంతమైన విజ్ఞాన యాత్ర

**వత్సవాయి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వత్సవాయిలోని బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం నుండి ప్రవాస భారతీయుడు గ్రామానికి చెందిన చిరుమామిళ్ల రాంబాబు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన



విద్యార్థుల విజ్ఞాన యాత్ర విజయవంతమైంది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, గురుకుల పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఈ విజ్ఞాన యాత్రలో పాల్గొన్నారు. ముందుగా వత్సవాయి నుండి ప్రత్యేకమైన బస్సులో విజయవాడకు చేరుకొని అక్కడ విద్యార్థులు సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న ప్రత్యేక గైడ్లు విద్యార్థులకు సైన్స్ సెంటర్లో ఉన్న అన్ని ప్రయోగాల గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. దాదాపు రెండు గంటలు ఈ సైన్స్ సెంటర్లో పాల్గొన్న విద్యార్థులు అనంతరం సమీపంలో ఉన్న పున్నమి ఘాట్‌ను సందర్శించారు. భోజనానంతరం విద్యార్థులు గాంధీ హిల్ చేరుకొని అక్కడ నక్షత్రశాలలో పాల్గొని ఆకాశంలో జరుగుతున్న వింతలను, విశేషాలను స్వయంగా గ్రహించి తన్మయత్వం చెందారు. అనంతరం గాంధీ హిల్ పైభాగాన్ని చేరుకొని అక్కడనుండి విజయవాడ అందాలను సందర్శించారు. ఈ విజ్ఞాన యాత్రలో విద్యార్థులు ఆద్యాంతము అత్యంత ఉత్సాహంగా పాల్గొని అనేక విషయాల పట్ల అవగాహన పొందారు. కార్యక్రమంలో హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు మార్కపూడి బాబురావు, ఎస్సీ సంక్షేమ వసతి గృహ వాచ్‌మెన్ అరిగెల రవి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు నబీన, విజ్ఞాన కేంద్ర ప్రతినిధులు చిరుమామిళ్ల హనుమంతరావు, బి రాము, చిట్టూరి జనార్ధన్, సామినేని శ్రీనివాసరావు, నరమనేని సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డివై ఈ వై పాలసీమ ఆకస్మిక తనిఖీ

**నందిగామ ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** చందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం డివైఈవో ఉప్పులూరి గురునాథం విజిట్ చేయడం జరిగింది. పాఠశాల యొక్క నిర్వహణను పరిశీలించి మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. తరగతి గదులను విజిట్ చేసి విద్యార్థులు యొక్క నోట్ బుక్స్ చెక్ చేసి వారి యొక్క ఎడ్యుకేషన్ గురించి అడిగి తెలుసుకోవడం జరిగిందని వల్లం కొండ శ్రీనివాసరావు తెలియజేశారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు, అహమ్మద్ ప్యారా, విజయ్‌కుమార్, ఈ కార్యక్రమములో పాల్గొన్నారు.



## ప్రత్యేక కార్పొరేషన్,ఎస్టీ వర్గీకరణకై యానాదుల అర్ధనగ్న ప్రదర్శన

**విజయవాడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** ప్రత్యేక కార్పొరేషన్ మరియు ఎస్టీ వర్గీకరణ సాధనకై విజయవాడ లోని ధర్నాచౌక్ లో జరుగుతున్న దీక్షలో భాగంగా నాల్గవ రోజు గురువారం అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. వారికి సిపిఎం పార్టీ నేతలు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కెసి పెంచలయ్య యానాది మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు, బాపట్ల బ్రహ్మయ్య, పుత్తూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతోనే ఆరోగ్యం, సంతోషం రెట్టింపు : ప్రత్తిపాటి

### ఏపీ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ లో భాగంగా సరదాగా వాలీబాల్ ఆడిన మాజీమంత్రి



**చిలకలూరిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ప్రజలకు క్రీడల్లో ఆసక్తి పెంచి, వారి ఆరోగ్యం, సంతోషాన్ని రెట్టింపు చేయాలన్న సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా క్రీడాపోటీలు నిర్వహించాలనే ఆలోచన చేశారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. విజయవాడలో జరుగుతున్న ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్



2026లో మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా రెండోరోజు ఆయన నరసరావుపేట శాసనసభ్యులు అరవిందబాబుతో జట్టుకట్టి, నక్కాఆనంద్ బాబు, పితాని సత్యనారాయణతో టీమ్ తో సరదాగా వాలీబాల్ ఆడారు. ఆట ముగిసిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. ప్రజల్ని ఎల్లప్పుడూ ఆనందాల మూడ్ లో ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం కూటమిప్రభుత్వం ప్రజాసంతోషానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల్ని ఎల్లప్పుడూ ఆనందాల మూడ్ లో ఉంచాలన్న లక్ష్యంతోనే పాలకులు రాష్ట్రవ్యాప్తంగా కొండవీడు తరహా ఉత్సవాలను, కోటప్పకొండ వంటి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి వివరించారు. రాష్ట్రాన్ని హ్యాపీ మోడ్ లో ఉంచేందుకు ప్రజాప్రతినిధుల్ని ప్రభుత్వం ఆటల్లో భాగస్వాములను చేసిందన్నారు. క్రీడల్లో యువతలో ఆసక్తిపెంచాలన్న ఉద్దేశం కూడా దీనిలో భాగమన్నారు. ప్రజలు సాంకేతిక పరిజ్ఞానం నుంచి ఉపశమనం పొందాలంటే ఈ తరహా క్రీడలే ప్రధాన మార్గమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

## నాదెండ్ల పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ డీఎస్పీ జయకృష్ణ



**నాదెండ్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** నాదెండ్ల పోలీసు స్టేషనును ట్రైనీ డీఎస్పీ కె. జయ కృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషను సిబ్బంది పనితీరును, రికార్డులను పరిశీలించారు. నాదెండ్ల ఎస్సై ఆర్. వెంకటేశ్వరరావు, యడ్లపాడు ఎస్సై శివ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## సెల్‌ఫోన్ల రికవరీ: పోగొట్టుకున్నవారికి అప్పగింత

**చిలకలూరిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి 10 సెల్ ఫోన్ లను రికవరీ చేసి గురువారం చిలకలూరిపేట అర్బన్ సి.యస్ ఇన్స్పెక్టర్ రమేష్ సెల్ ఫోన్ లను పోగొట్టుకున్న బాధితులకు అప్పగించారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా: పారిశుధ్యంపై కౌన్సిలర్ల గళం

**చిలకలూరిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పట్టణంలో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం, తాగునీటి ఎద్దడిపై చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వేదికగా సభ్యులు గళమెత్తారు. గురువారం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా చర్చ సాగింది. కుంటుపడిన పారిశుధ్యం.. ఒకే కార్మికురాలితో మూడు బజార్లా? ఎజెండా పఠనం ముగియగానే 22వ వార్డు కౌన్సిలర్ కూనాల ప్రమీల పారిశుధ్య సమస్యపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన వార్డులో పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. "మూడు బజార్లకు కలిపి కేవలం ఒకే పారిశుధ్య కార్మికురాలు పని చేస్తోందని, ఇలాగైతే వీధులు ఎలా శుభ్రపడతాయి?" అని అధికారులను నిలదీశారు. తక్షణమే సిబ్బందిని పెంచి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన చైర్మన్ షేక్ రఫాని, క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు వస్తున్నాయని, శానిటరీ ఇన్స్పెక్టర్లు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి ముందే తాగునీటి కష్టాలు.. రంజాన్ వేళ ఇబ్బందులు 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మోలాలి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం వాడల్లో నీటి ఎద్దడి వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని, వేసవి ముందే పరిస్థితి ఇలా ఉంటే ముందుముందు మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. పైపులైన్ల లీకేజీలు, ఇంటర్‌లింకింగ్ పనుల వల్లే సరఫరాలో అంతరాయం కలుగుతోందని డీఈఈ షేక్ అబ్దుల్ రహీం వివరణ ఇస్తూ, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ధన్యవాదాలు మున్సిపాలిటీని సెలెక్షన్ గ్రేడ్ స్థాయికి తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు కౌన్సిలర్లు కొత్త కుమారి, బేరింగ్ మోలాలి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన రూ. 45 లక్షల నిధులతో అంగన్‌వాడీ, సచివాలయ భవన పనులు నిరంతరాయంగా సాగేలా సహకరించినందుకు వైసీపీ కౌన్సిలర్ కోట్యానాయక్ కూడా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. సంతాపం మరియు ఆమోదం సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన మాజీ కౌన్సిల్ సభ్యురాలు మజీరున్నీసాకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం ఎజెండాలోని అన్ని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.



## శనగ కొనుగోళ్లపై అవగాహన కార్యక్రమం

**చిలకలూరిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** చిలకలూరిపేట మండలంలో ఏపి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రమేష్ జీడీసీఎంఎస్, మరియు పిఏసిఎస్ సిబ్బందికి శనగ కొనుగోలు పై మండల వ్యవసాయ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు, వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు సేవా కేంద్రం ఒక కొనుగోలు కేంద్రమేనని రైతులు తాము పంట నమోదు చేయించుకున్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి తమ పంటను ప్రభుత్వ మద్దత్తు ధరకు అమ్ముకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం వారు చిన్న సన్నకారు రైతులనుంది ముందుగా కొనుగోలు చేస్తుందని, పంట యొక్క తేమ శాతం 14 మించి ఉండరాదని,, పంటను కొనుగోలు చేసిన 15 రోజులలో ప్రభుత్వం వారు డబ్బులు జమ చేస్తారని కావున ఆధార్ నెంబర్ కు లింక్ అయిన బ్యాంకు అకౌంట్ యొక్క మరియు పరిమితి స్థాయిని సరిచేసుకోవాలని తెలిపారు ముఖ్య అతిథిగా విచేసిన జిల్లా వ్యవసాయ అధికారి బాణావత్ జగ్గారావు గారు మాట్లాడుతూ రైతు సేవ కేంద్ర సిబ్బంది ద్వారా తమ పంటను ఈ క్రాప్ చేసుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వం వారు అందించే మద్దతు లభిస్తుందని రైతులకు తమ సిబ్బంది ఎప్పటినుంచో అవగాహన కల్పిస్తునరాని తెలిపారు, అలా ఈ క్రాప్ నందు నమోదు చేసుకున్న రైతులు రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి సీఎం యాప్ నందు రిజిస్టర్ చేసుకొని షెడ్యూల్ ప్రకారం తమ పంటను తమ రైతు సేవ కేంద్రం వద్దనే ప్రభుత్వం అందించే మద్దతు ధరకు రైతులకు అమ్ముకోవచ్చునని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ సరిత, మార్క్‌ఫెడ్ మేనేజర్ అరుణ్, జిడిసిఎంఎస్, పిఏసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు



## సర్వే తీరుపై ఎన్ఎస్పీ కెనాల్ అధికారుల ఆగ్రహం

**యడ్లపాడు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** అధికారులు ఉదాసీన వైఖరి, విధి అలసత్వంతో ప్రైవేటు ఆస్తులకే కాదు ప్రభుత్వ ఆస్తులు కూడా ఆక్రమణలకు గురి అవుతున్నాయి. మండల పరిధిలోని వంకాయలపాడు రెవిన్యూలోని సంగంగోపాలపురం రోడ్డులో కొండవీడు మేజర్ కాల్వ పక్కన సుమారు 8 ఎకరాల పట్టా భూమిని పదేళ్ల క్రితం గుంటూరుకు చెందిన అవోపా నగర్ వెల్ఫేర్ సొసైటీ వారు కొనుగోలు చేశారు. సదరు భూమి పైభాగంలో నుంచి కొండవీడు మేజర్ కాల్వ పోతుంది. పలు కారణాలతో భూయజమానులు భూమిని కొనుగోలు చేసిన సమయంలో సర్వే చేయించుకోలేదు. సదరు భూమిని స్థిరాస్తి వెంచర్గా మర్చే ఉద్దేశంలో భూయజమానులు ఇటీవల సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సర్వే సిబ్బంది వచ్చి హద్దు రాళ్లు పాతారు. విధి నిర్వహణలో భాగంగా కొండవీడు మేజర్ కాల్వ లస్కర్ సుబ్బారావు కాల్వపై బుధవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కాల్వకట్ట మధ్యలో సర్వే హద్దురాళ్లు కనిపించాయి. లస్కర్ పై అధికారులకు సమాచారం అందించారు. దీంతో కొండవీడు మేజర్ కాల్వ ఏఈ నందినిరెడ్డి, రేపూడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ16 అధ్యక్షుడు పున్నారెడ్డి కాల్వకట్టపై సర్వేరాళ్లు పాతిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. కాల్వ వెడల్పు ప్రాంతాల వారీగా 60 మీటర్ల నుంచి 45 అడుగుల వరకు ఉంటుందన్నారు. మరోసారి సర్వే నిర్వహించాలని సర్వే అధికారులను కోరినట్లు తెలిపారు. పున్నారెడ్డి మాట్లాడుతూ. అధికారులు, రైతులు రాకపోకలు సాగించే కాల్వకట్ట మధ్యలో సర్వేయర్లు హద్దురాళ్లు పాతటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. సుమారు 20 మీటర్లు కాల్వకట్టపైకి వచ్చి హద్దురాళ్లు పాతారనవ అగ్రహం వ్యక్తపరిచారు. సర్వే సిబ్బంది ఖచ్చితమైన కొలతలతో సమగ్ర సర్వే నిర్వహించి హద్దురాళ్లు పాతాలని కోరారు. కార్యక్రమంలో కొండవీడు మేజర్ కాల్వ వర్క్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, లస్కర్ సుబ్బారావు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

**మాచర్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** జనసేన సభ్యత్వనమోదు కార్యక్రమంలో పట్టణ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బూసా రామాంజనేయులు పాల్గొని సభ్యత్వాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టినట్టు తెలిపారు. సభ్యత్వం కేవలం గుర్తింపు కార్డులకు మాత్రమే పరిమితం కాకుండా, కష్టపడి పనిచేసే జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. పార్టీ కోసం శ్రమించే ప్రతిఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ, అభిమానులు, యువత సభ్యత్వ నమోదులో పాల్గొని జనసేనాని ఆశయ సాధనలో భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లాల్‌కృష్ణ గౌడ్, సాంబశివరావు, మల్లయ్య, మదీన్, కృష్ణబాబు, అంబటి నరసింహారావు, వినోద్, శ్రీహరి, ఫారుక్, సాయి, నరసింహారావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాయవరం గ్రామంలో వివాదాస్పద భూమి పరిశీలన

**మాచర్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు రాయవరం గ్రామంలో వివాదాస్పద భూమిని మాచర్ల తహశీల్దారు కిరణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన గాలి బ్రహ్మయ్య, కడియం సైదారావులు ఇచ్చిన అర్జీ పరిశీలనలో భాగంగా సర్వేనెం.744, 46బి, 387 లోని భూమిని రెవెన్యూ రికార్డు ప్రకారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూమి నిర్ధారణ అయితే ఆక్రమణదారులపై చట్టప్రకారం చరనయలు తీసుకుంటామని తహశీల్దారు తెలిపారు.



## మాచర్లలో వివాదాస్పద భూమి పరిశీలన



**మాచర్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మాచర్లలో వివాదాస్పద భూమిని తహశీల్దారు కిరణ్‌కుమార్ గురువారం సందర్శించారు. రెవెన్యూ క్లినిక్‌లో దాఖలైన అర్జీ విషయమై సర్వేనంబరు 198లోని భూమిని మండల సర్వేయరుతో కలిసి విచారించారు. సదరు భూమి విషయమై ఇరువర్గాల వారి దస్తావేజులను పరిశీలించి నివేదికను కలెక్టరుకు అందజేయనున్నట్లు తెలిపారు.

## వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ

**పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** మండలంలోని తుమ్మలచెరువులో గురువారం పిడుగురాళ్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యాన వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట వేసిన రైతులంతా ఒకే రోజు సామూహికంగా ఎలుకల నివారణ కార్యక్రమం చేపడితే వరి పంటలో ఎలుకల వలన కలిగే నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. ఈ సందర్భంగా రైతులకు 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమో డయాలిన్‌తో కలిపి తయారు చేసిన విషపు ఎరను 10 గ్రాముల ప్యాకెట్స్‌లో కలిపి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు నరసయ్య, హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.



## టిడిపి నేత ఏడుకొండలుపై దాడి దారుణం: పార్టీ బీసీ నేతలు

**గురజాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** వైసీపీ మూకలు తేలుకుట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత బత్తుల ఏడుకొండలుపై దాడి చేయడం దారుణమని టీడీపీ మండల బీసీ నేతలు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతుంటే ఇదే అదునుగా వైసీపీ నేతలు దాడులకు దిగడం సరైంది కాదన్నారు. నరసరావుపేటలో ఉండే మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి వాళ్ల కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు ఉసిగొల్పడం సరైంది కాదన్నారు. మా శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు క్రమశిక్షణగా ఫ్యాక్షన్ వద్దు, అభివృద్ధి ముద్దు అనే మార్గంలో వెళ్తుంటే వీళ్లు మాత్రం ఇంకా అధికారంలో ఉన్నారనే భ్రమతో దాడులకు దిగుతున్నారన్నారు. మహేష్‌రెడ్డి దీనికి సమాధానం చెప్పాలన్నారు. పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో బత్తుల శ్రీనివాసరావు, చల్లా శ్రీను, మహంకాళి నీలంరాజు, మక్కెన శ్రీనివాసరావు, లింగా చారి, పుల్లారావు, బెజవాడ నవీన్, సైద్ రాజు, అంజి, వెంకట్‌రాజు, గుంజా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీటీఎఫ్ 'ఛలో ఢిల్లీ' కరపత్రాల ఆవిష్కరణ

**కారంపూడి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** స్థానిక మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఈ నెల 27న జరగబోయే ధర్నా కార్యక్రమ డిమాండ్ల పత్రాన్ని ఏపీటీఎఫ్ కారంపూడి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కారంపూడి మండల శాఖ అధ్యక్షుడు భాస్కరరావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్‌లు మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారానికి ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ కార్యవర్గ సభ్యులు బాలు, షకీల్, శివప్రసాద్, శేషయ్యలు పాల్గొన్నారు.



## షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక పూజలు



**కారంపూడి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** స్థానిక వీరాంజనేయ షిరిడిసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, కాకడ హారతి, పంచామృత అభిషేకం 27 మంది మహిళా భక్తులచే సాయి నక్షత్ర మాలికా పారాయణ కార్యక్రమం జరిగింది. అనంతరం పారాయణలో పాల్గొన్న వారికి బహుమతి ప్రదానం చేశారు. లక్కీడిప్ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. దాతలు లక్ష్మారెడ్డి పద్మావతిల కుమారుడు నరేంద్రరెడ్డి కుటుంబ సభ్యులచే ఈకార్యక్రమం జరిగింది. మహిళా అధ్యక్షురాలు గుండా నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతమైందని ఆలయ అధ్యక్షులు శంకర్రావు తెలిపారు. ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ ఆచార్యులు పూజలు నిర్వహించారు.

## 'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి'

**కారంపూడి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఒప్పిచర్ల గ్రామీణ బ్యాంకు మేనేజరు అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 2025లో రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించారన్నారు. అదే ఒరవడితో విద్యార్థులు రాణించాలన్నారు. విద్యార్థులకు జామెట్రీ బాక్సు, ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యా యులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం విలియం శౌరిబాబు, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, పల్చూరి పీటర్‌పాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## సాగునీటి రంగానికి పట్టిన గ్రహణం.. గత ప్రభుత్వం.. : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ధృఢ సంకల్పంలో భాగంగా, కూటమిప్రభుత్వం సాగునీటి రంగానికి రూ.52,724 కోట్ల నిధులు కేటాయించిందని, ఈ 20 నెలల్లోనే 25,948 కోట్లు ఖర్చుచేయడం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు, మధ్య.. చిన్నతరహా ప్రాజెక్టుల నిర్మాణ పనుల్ని పరుగులు పెట్టిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం రైతుల ప్రయోజనాలు, భారీ, మధ్య తరహా నీటి పారుదల శాఖ పరిధిలోని పథకాలకు నిధుల కేటాయింపులు అన్న అంశంపై సభలో గురువారం జరిగిన లఘుచర్చలో ప్రత్తిపాటి మాట్లాడారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంతో పాటు, ఉత్తరాంధ్ర, రాయలసీమలోని పలు ప్రధాన ప్రాజెక్టుల పూర్తే లక్ష్యంగా ప్రభుత్వం వడివడిగా ముందుకు సాగడం రాష్ట్ర రైతాంగానికి నిజంగా ఒక వరమని ప్రత్తిపాటి పేర్కొన్నారు.



**సాగునీటి రంగంపై గతపాలకుల నిర్లక్ష్యం.. రైతులకు అష్టకష్టాలు :**

రాష్ట్ర సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన గత పాలకులు, రైతుల్ని అష్టకష్టాలకు గురిచేశారని ప్రత్తిపాటి తెలిపారు. ఏపీ సాగునీటి రంగానికి పట్టిన గ్రహణం.. గత ప్రభుత్వమని, రివర్స్ టెండరింగ్ డ్రామాలాడి, పోలవరాన్ని కేవలం 2.5 శాతం మాత్రమే పూర్తిచేసిందన్నారు. డయాఫ్రమ్ వాల్ దెబ్బతినేవరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని గోదారి ప్రవాహానికి వదిలేసిందన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాలకు నీళ్లిచ్చినట్టు సినిమా సెట్టింగులు వేసి ప్రజల్ని వంచించిన ఘనులు గత పాలకులన్నారు. గత పాలకులు సాగునీటి రంగాన్ని తమ ప్రచార ఆర్బాటానికి వాడుకున్నారన్నారు.. 200కు పైగా ప్రాజెక్టుల నిర్మాణ పనుల్ని ప్రీ క్లోజర్ చేసి, రూ.18 వేలకోట్లకు పైగా బకాయిలు పెట్టిన ఘనత గత ప్రభుత్వానిదని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చంద్రబాబు నాయకత్వంలోనే పోలవరం 88శాతం పూర్తి..**

పోలవరం నిర్మాణం చంద్రబాబు నాయకత్వంలోనే 88 శాతం పూర్తయిందని, ఇది నిజంగా చరిత్రలో నిలిచిపోయే రికార్డు అని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ప్రజల సాగు..తాగునీటి అవసరాలు తీర్చే పోలవరాన్ని వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం నిర్మాణపనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కూటమిప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, అలానే సాగునీటి కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టి, నీటిపారుదల వ్యవస్థను మెరుగుపడిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం 11,359 పనులు జరిగాయని, అందుకు గాను ప్రభుత్వం రూ.878 కోట్లు కేటాయించిందన్నారు.

**నియోజకవర్గం భూములకు సాగర్ జలాలు అందేలా చూడాలి:**

రూ.6వేలకోట్లతో చేపట్టిన వైకుంఠపురంనకరికల్లు ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పాలి చిలకలూరిపేట నియోజకవర్గంలోని వంకాయలపాడు, కొండవీడు మేజర్లు, చిలకలూరిపేట పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్, తుర్లపాడు మేజర్ పనులపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తిచేశారు. నియోజకవర్గంలోని సాగుభూముల నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని చివరిభూములైనందున నీటిఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. వైకుంఠపురం నుంచి నకరికల్లు వరకు కృష్ణా జలాలు అందించే ప్రాజెక్టు దివంగత కోడెల శివప్రసాదరావు స్పీకర్ గా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారని, దానిపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఆ ప్రాజెక్టును నల్లమల సాగర్ కు అనుసంధానిస్తామని చెబుతున్నారని, ఎలా మార్చిన డిజైన్లు మారవు కాబట్టి.. రూ.6వేలకోట్లతో చేపట్టిన ఆ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత ఇవ్వాలని ప్రత్తిపాటి ప్రభుత్వాన్ని కోరారు. 2018లో రూ.300 కోట్లతో చేపట్టాలనుకున్న గుంటూరు ఛానల్ పనులు నేటికీ ప్రారంభం కాలేదన్నారు. ఆ ఛానల్ పనులు ప్రారంభించి, దాన్ని పొడిగిస్తే చిలకలూరిపేట నియోజకవర్గం చివరి భూములకు సమృద్ధిగా సాగు నీరు అందుతుందని, తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## సత్తెనపల్లి ఎపిజెఎసి చైర్మన్‌గా పెండెం మణిరావు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఏపీ జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పిలుపుమేరకు సత్తెనపల్లి ఏపీ ఎన్జీవో కార్యాలయంలో సత్తనపల్లి తాలూకా ఏపీ జెఏసి కార్యవర్గ సమావేశం సత్తెనపల్లి ఏపీ జెఏసి తాలూకా అధ్యక్షుడు పెండెం మణిరావు అధ్యక్షతన జరిగింది ఈ కార్యవర్గ సమావేశంలో సత్తెనపల్లి తాలూకా ఏపీ జెఏసి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది పెండెం మణి రావు ( చైర్మన్) పి రమేష్ బాబు (కార్యదర్శి), వి. నాగేశ్వర రావు (కో చైర్మన్) కె. శివారెడ్డి(కో చైర్మన్) వెంకటేశ్వర్లు (కో చైర్మన్) బి కొండలరావు ( వైస్ చైర్మన్) జి సునీల్ బాబు (వైస్ చైర్మన్ ) సిహెచ్. ఆగష్టస్ బాబు (వైస్ చైర్మన్ జై లక్ష్మీనారాయణ (వైస్ చైర్మన్ ) ఎస్‌కె కరిముల్లా (జాయింట్ సెక్రటరీ) ఎం చంద్రశేఖర్ (జాయింట్ సెక్రెటరీ) వై నాగార్జున (జాయింట్ సెక్రెటరీ) కే కోటేశ్వరరావు (జాయింట్ సెక్రెటరీ) పి అశోక్ కుమార్ ( ఆర్గనైజింగ్ సెక్రటరీ )గా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి తాలూకా యూనిట్ ఏపీ ఎన్జీవోస్ కార్యదర్శి ఎస్. అంబేద్కర్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బి ఆర్ కె కుమార్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావు సత్తెనపల్లి తాలూకా ఆర్గనైజింగ్ సెక్రటరీ. సందేపోగు. శ్రీనివాసరావు వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె ఇబ్రహీం వైస్ ప్రెసిడెంట్ ,టైగర్ నాగేశ్వరరావు, పరిమి రాంబాబు, నటరాజ్, చందు, తదితరులు పాల్గొన్నారు







## రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** సత్తెనపల్లి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల నందు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం లో భాగంగా ప్రతి గ్రామం లో వరి సాగు విస్తీర్ణం ఆధారం గా బ్రోమోడయోలీన్ అనే ఎలుకల మందును రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఉచితం గా 100 రాయితీ పై పంపిణీ చేయటం జరిగినది. మండల వ్యవసాయ అధికారిబి సుబ్బారెడ్డి కొమెరపూడి గ్రామం నందు గ్రామ సభలో పాల్గొని సామూహిక ఎలుకల నిర్మూలన గురించి రైతులకు వివరించటం జరిగింది మరియు బ్రోమోడయోలీన్ అనే ఎలుకల మందు విషపు ఎరను రైతుల ద్వారా తయారు చేయించి వరి పండించే రైతులకు పొలం గట్లపై ఎలుక కన్నాల వద్ద పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సామూహిక ఎలుకల నివారణ కొరకు రైతులందరూ కూడా బ్రోమోడయోలీన్ అనే ఎలుకల మందు విషపు ఎరను తమ పొలంలోని ఎలుక బొరియలు నందు ఉంచాలని తెలియజేశారు. అదే విధంగా ప్రతి రైతు సేవా కేంద్రం నందు కూడా బ్రోమోడయోలీన్ అనే ఎలుకల విషపు ఎరను తయారు చేసి రైతులకు పంపిణీ చేయటం జరిగినది. మరియు మొక్కజొన్న పంటలో జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం క్రింద సామూహిక ప్రదర్శనక్షేత్రాలు ద్వారా ఏర్పాటుచేసిన క్షేత్రాలను సందర్శించడం జరిగినది.



## సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం...

**రాజుపాలెం, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. వెంకట నరసయ్య మరియు మస్తానమ్మ, సహాయ వ్యవసాయ సంచాలకులు, క్రోసూరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి. వెంకట నరసయ్య మాట్లాడుతూ ఎలుకలను సమర్థవంతంగా నివారించుటకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అయినటువంటి సాగు పద్ధతులు, యాంత్రిక పద్ధతులు, జీవ నియంత్రణ పద్ధతులు, మరియు రసాయనిక పద్ధతులు పాటించాలి అని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును 100 శాతం రాయితీపై సరఫరా చేయుచున్నది. అదేవిధంగా విషపు ఎర తయారీ విధానాన్ని కూడా రైతులకు తెలియజేశారు. 1 హెక్టారుకు బ్రోమోడయోలిన్ 10 గ్రాముల చొప్పున 100 గ్రాముల విషపు ఎర తయారీకి, 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును, 96 గ్రాముల నూకలు మరియు 2 గ్రాముల నూనె కలిపి ఒక్కొక్క సజీవ బొరియకు 10 గ్రాముల చొప్పున విషపు ఎరను పొట్లాలు కట్టి బొరియల్లో వేయాలి. సామూహికంగా చేపట్టాలి అని సూచించారు. వ్యవసాయ సహాయకులు హేమంత్, రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా రావెల కోటేశ్వరరావు జన్మదిన వేడుక

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** స్థానిక 16 వార్డు వడ్డవల్లి శాస్త్రినగర్ కు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, పాస్టర్ రావెల కోటేశ్వరరావు 87వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ ) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ లు పాల్గొని కోటేశ్వరరావునుసన్మానించారు . ఉపాధ్యాయుడుగా ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తయారుచేసిన ఆయన ఇప్పుడు పాస్టర్ గా ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించటం శుభ పరిణామమని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని ఇరువురు పేర్కొన్నారు. వారి వెంట కంభంపాటి వెంకటేశ్వర్లు (డుమ్ము), భాస్కర్, ప్రసాద్ తదితరులున్నారు.



## నేటి నుంచి నరసరావుపేట రంగస్థలి 46వ వార్షికోత్సవ వేడుకలు

**25వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ప్రారంభం**

**3 రోజులపాటు అలరించనున్న నాటికల ప్రదర్శన**

**నరసరావుపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** నరసరావుపేట రంగస్థలి (నటీనట ప్రేక్షక సమాఖ్య) 46వ వార్షికోత్సవం 25వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ఫిబ్రవరి 27, 28 మార్చి 1 తేదీలలో వరుసగా 3 రోజులపాటు జరగనున్నట్లు నరసరావుపేట రంగస్థలి అధ్యక్షుడు షేక్. మహబూబ్ సుభాని తెలిపారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసరావుపేట రంగస్థలి గౌరవ అధ్యక్షులు కిలారు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నల్లపాటి విజయ్ రామచంద్రబోస్, ఉపాధ్యక్షులు ఇక్కుర్తి మస్తాన్ రావు తో కలిసి మహబూబ్ సుభాని మాట్లాడారు. స్థానిక ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాలులో ప్రముఖ నాటక, సినీనటులు



దివంగత కోటా శ్రీనివాసరావు కళా ప్రాంగణంలో మూడు రోజుల పాటు 7 నవరసభరిత నాటికలను ఎంపిక చేసి, ప్రదర్శించబోతున్నామన్నారు. రంగస్థలి ఆహ్వాన నాటిక పోటీలకు ఇది రజతోత్సవ సంవత్సరం అన్నారు. గడిచిన 24 ఏళ్లుగా నరసరావుపేట రంగస్థలి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వస్తోందని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రంగస్థలి ఆహ్వాన నాటిక పోటీలకు ఒక ప్రత్యేకత, ప్రాముఖ్యత వున్నాయన్నారు. ఉత్తమ స్థాయి పోటీ నాటికలను రంగస్థలి వేదికగా ప్రదర్శిస్తూ వస్తున్నాయని తెలిపారు. ఎందరో లబ్ధప్రతిష్టులైన నాటక, టీవీ, సినీరంగ ప్రముఖులు, కళాకారులను రంగస్థలి విశిష్ట వ్యక్తి పురస్కారం, రంగస్థలి ప్రతిభా పురస్కారాలతో ఘనంగా సత్కరిస్తూ వస్తోందని చెప్పారు. ప్రతిరోజూ మరెన్నో ఆహ్లాదభరిత నృత్య, సంగీత, సాంస్కృతిక కళా ప్రదర్శనలు మిమ్మల్ని అలరించబోతున్నాయని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. రంగస్థలి అభిమాన ప్రేక్షకులు, దాతలు, శాశ్వత సభ్యులు, ప్రముఖులు, అతిథులు, కళాకారులు మరియు కళాభిమానులందరూ మూడు రోజుల కళా సంరంభాన్ని ఆద్యంతం వీక్షించి జయప్రదం కోరారు.

## వాహనాలను తనిఖీ చేసిన వెహికల్ ఇన్‌స్పెక్టర్

**నరసరావుపేట క్రైమ్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణంలో గురువారం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవిఐ) శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, హెల్మెట్ వినియోగం తదితర అంశాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవిఐ విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలని, హెవీ వాహనాలను టౌన్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివ నాగేశ్వరరావు హెచ్చరించారు.



## సమస్యలను పరిష్కరించకుంటే 'చలో విజయవాడ'కు పిలుపు': సిఐటియు

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** అంగన్వాడీలకు గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని లేకుంటే అంగన్వాడీల ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం గురికావాల్సి ఉంటుందని సిఐటియు పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి సిలార్ మసూద్ అన్నారు. అంగన్వాడీ వర్కర్లు హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట ధర్నాచౌక్ లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాలుగవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిలార్ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు అంగన్వాడి కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా 42 రోజులు పోట్లాడి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాల్సిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా నిరక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. అంగన్వాడీల శక్తిని విస్మరించి ఎన్డీఏ నాయకత్వంలోని సీఎం చంద్రబాబు ప్రభుత్వం అంగన్వాడీల ఆగ్రహానికి గురికాకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. వేతనాలు, గ్రాట్యుటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వేసవికాలం వేతనంతో కూడిన సెలవులు, మినీ సెంటర్ మెయిన్ సెంట్రల్ గా గుర్తించడం, అర్హత ఉన్న ఆయాలకు ప్రమోషన్లు ఇవ్వడం, తదితర న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదన్నారు. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుంటే చలో విజయవాడ కార్యక్రమం చేపట్టాల్సి ఉంటుందన్నారు. వెంటనే సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి శివకుమారి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడికొండ రత్నకుమారి, వినుకొండ, ఈపూరు ప్రాజెక్టు నుండి జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న, వర్కర్లు, ఆయాలు దీక్షలో కూర్చున్నారు.

## అంతర్జాతీయ నాటకోత్సవంలో కిలారు వెంకట్రావుకు సత్కారం

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణానికి చెందిన కిలారు వెంకట్రావుకు అంతర్జాతీయ నాటక మహోత్సవంలో సన్మాన కార్యక్రమం జరిగింది. వివరాలను శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో తెలియజేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉన్న నరసరావుపేట రంగస్థలి కి దీర్ఘకాలంగా తాను సేవలందించే అవకాశం రావడం సంతోషమన్నారు . గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా మరియు వేదిక సంయుక్తంగా భారతరంగ్ మహోత్సవ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అంతర్జాతీయ నాటకోత్సవంలో పాల్గొనే అవకాశం రావడంతో పాటు నిర్వాహకులు తన సేవలకు గుర్తింపుని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తనకు జరిగిన సత్కారం నర్సరావుపేట రంగస్థలం కమిటీ సభ్యులకు, కళాభిమానులకు జరిగినట్లుగా భావిస్తున్నట్లు తెలియజేశారు. నరసరావుపేట రంగస్థలం కి అంతర్జాతీయ వేదికపై తగిన గుర్తింపు లభించటం ఆనందంగా ఉందన్నారు. సమస్త నిర్వహణకు తగిన గుర్తింపు లభించినట్లు అయిందని పేర్కొన్నారు. మన బాధ్యత ఇటువంటి కార్యక్రమాల వలన మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రంగస్థలం ముందుకు వెళ్లేందుకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని సంఘం గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్న కిలారి వెంకట్రావు తెలియజేశారు.



# పల్నాడు జిల్లా వార్త



## అసెంబ్లీకి విచ్చేసిన విద్యార్థులతో ముచ్చటించిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

**వినుకొండ, ఫిబ్రవరి26, ప్రభాతవార్త:** శాసనసభ సమావేశాల సందర్శనలో భాగంగా అసెంబ్లీకి విచ్చేసిన వినుకొండ నియోజకవర్గం, ఈపూరు మండలం, బొగ్గరంగ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనే యులు సాధరంగా ఆహ్వానించారు. అసెంబ్లీ ఆవరణలో విద్యార్థులతో కలిసి ఆయన కొంత సమయం గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు





నిర్దేశించుకోవాలని, క్రమశిక్షణతో చదివి సమాజంలో మంచి స్థితికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయనే విషయాలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.

## పల్నాడు జిల్లా హ్యూమన్ రైట్స్ చైర్మన్‌గా కలవకూరి గణేష్

**వినుకొండ,ఫిబ్రవరి26,ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా ఎంఆర్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు హ్యూమన్ రైట్స్ కార్యాలయము నందు వినుకొండ పట్టణానికి చెందిన కలవకూరి గణేష్ జిల్లా హ్యూమన్ రైట్స్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. గణేష్ మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కుల పరిరక్షణకు అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరు నడుం



బిగించాలన్నారు. జిల్లాలో సంస్థ మరింత బలోపేతం చేయాలని బాధితులకు న్యాయం చేకూర్చడంలో ఎంఆర్ హ్యూమన్ రైట్స్ సంస్థ సభ్యులు కృషి చేయాలన్నారు. హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు గుండా రెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, హ్యూమన్ రైట్స్ జాతీయ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రోడ్డ తిరుపతయ్య చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక గుంటి ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ చలంకూరి కోటేశ్వరరావు మేడం అశోక్, కొండ్రముట్ల హరినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ శివలింగ ప్రసాద్, సుతారం గోవిందా చారి, బీరం రామారావు తదితరులు పాల్గొన్నారు

## క్రీడాపోటీల్లో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థుల ప్రతిభ





**వినుకొండ,ఫిబ్రవరి26,ప్రభాతవార్త:** క్రీడలు కేవలం వినోదాన్ని మాత్రమే కాక మానసిక చురుకుదనంతోపాటు స్ఫూర్తినిస్తాయని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు అన్నారు. ఈనెల 25వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రౌండ్ లో జరిగిన అంతర్ కళాశాలల నెట్ బాల్ పోటీలలో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు ఎంపీఈడీ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న ఎస్ రవితేజ, కె.భానుప్రకాష్, ఎ. వెంకటరమణ తృతీయ స్థానం సాధించటం జరిగిందన్నారు. మార్చి నెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఎస్ఏజిఈ యూనివర్సిటీ భోపాల్ లో జరగబోవు ఆలిండియా విశ్వవిద్యాలయాల పోటీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు డైరెక్టర్ దరువురి శ్రావ్య అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, ఎం. దాసు, ఏ.సాయి ప్రసాద్ అభినందించారు.

## మున్సిపల్ పన్ను చెల్లింపుదారులు సకాలంలో చెల్లించాలి: కమీషనర్

**వినుకొండ,ఫిబ్రవరి26,ప్రభాతవార్త:** పురపాలక సంఘం పరిధిలో పన్ను చెల్లించాల్సిన ప్రజలు ఇంటి, కుళాయి, ఖాళీస్థలం పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను ఈ నెల 28వ తేదీలోపు చెల్లించాలని మున్సిపల్ కమీషనర్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. చెల్లించని యెడల అపరాధ రుసుం విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ ఇతరిత్రా సర్వే కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

## రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కార్యాలయం ప్రారంభం

**నరసరావుపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రంథాలయాల ఆధునికీకరణకు మరియు డిజిటల్ సేవల విస్తరణకు ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుని, ఎమ్మెల్యే డా చదలవాడ అరవింద బాబు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఎమ్మెల్యే డా చదలవాడ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా చదలవాడ మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయ వ్యవస్థను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. డిజిటల్ గ్రంథాలయాలు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులు, ఉద్యోగార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు గ్రంథాలయాలను కేవలం పుస్తకాల కేంద్రాలుగా కాకుండా జ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. యువతలో చదువు పట్ల ఆసక్తి పెంపొందించేందుకు గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మరియు అధికారులను ఎమ్మెల్యే డా చదలవాడ అభినందించారు



## పెన్షనర్లకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**నరసరావుపేట టౌన్,ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సంఘం పల్నాడు జిల్లా శాఖ నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించబడినది. ఈ కార్యక్రమమునకు ప్రెసిడెంట్ మానవ సుబ్బారావు అధ్యక్షత వహించినారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ సిసి ఆదయ్య ట్రెజరర్ ఎం ఎస్ ఆర్ కె ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ డిఎన్ మూర్తి రంగోచి షేక్ హుస్సేన్



రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వైద్య సిబ్బంది డాక్టర్లు ఏఎస్ రామకృష్ణ, జి.ఐ.డి ఎల్లమంద డాక్టర్ ఎస్ పి సరళ, జి.ఏ.డి పి.పద్మావతి జి.హెచ్.ఎం మరియు వారి స్టాఫ్ పి వెంకటేశ్వర్లు, కే. సునీత, లీలావతి పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినారు.

## ప్రజా సంఘాల పేరుతో వేధింపులపై ఎస్పీకి ఐఎంఏ నేతల ఫిర్యాదు

**నరసరావుపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో వైద్యశాల పైన, వైద్యులపైన ప్రజా సంఘాల పేరుతో జరిగిన, జరుగుతున్న వేధింపులపై శుక్రవారం అయ్యమ్మ నేతలు జిల్లా ఎస్పీ బి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. తమ ఫిర్యాదులో మేము ఉన్నత చదువులు చదివి సామాజిక బాధ్యతతో వైద్య వృత్తిలోకి అడుగుపెట్టాం అని తెలిపారు . రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడతాం. ఏ ప్రాణానికి హాని తలపెట్టమని ఇండి యన్ మెడికల్ అసోసి యేషన్ పల్నాడు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మథర్ థెరిస్సా సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాశరావు అన్నారు. ఈ మేరకు నరసరావుపేట లోని ఐఎంఏ భవన్ లో



ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రకాశరావు మాట్లాడుతూ అత్యవసర కేసులలో రోగి పరిస్థితి కుటుంబ సభ్యులకు వివరించి చికిత్స అందిచడం జరుగుతుందని అటువంటి కేసులలో ప్రాణాపాయం వాటిల్లితే కుటుంబ సభ్యుల కంటే ముందుగా ప్రజా సంఘాల నాయకులం అంటూ వైద్యులపై దౌర్జన్యం, హాస్పిటల్ విధ్వంసం, సిబ్బందిపై దాడికి పాల్పడి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వేధింపుల నేపథ్యంలో అత్యవసర కేసులకు చికిత్స అందించాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. కొన్ని ప్రయివేటు హాస్పిటళ్లను లక్ష్యంగా చేసుకుని ప్రజా సంఘాల పేరిట వేధింపుల నుండి తమకు రక్షణ కల్పించాలని ఎస్.పి కి ఫిర్యాదు చేయగా సానుకూలంగా స్పందించారన్నారు. ఇటీవల కాలంలో అత్యవసర కేసులలో చికిత్స అందించగా రోగి మృతి చెందిన పరిస్థితులలో వైద్యులను భయభ్రాంతులకు గురి చేసిన అనేక సంఘటనలు జరిగాయని ఎస్పి కి వివరించామన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అత్యున్నత వైద్య ప్రమాణాలకు కట్టుబడి ఉందని వైద్య నిరక్ష్యం గురించి అధికారి ఫిర్యాదు ఉంటే న్యాయ విచారణకు సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే రోగి మృతి విషయంలో బేరసారాలకు అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస రెడ్డి, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కె.భారతి, డాక్టర్ నెల్లూరి రమేష్, డాక్టర్ క్రాంతి కుమార్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలి

### ..పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ మెదరమెట్ల రామ శేషగిరిరావు

**నరసరావుపేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యూత్ రెడ్ క్రాస్ శిక్షణ శిబిరంలో జిల్లా చైర్మన్ మెదరమెట్ల రామ శేషగిరిరావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రెడ్ క్రాస్ యొక్క విశిష్టతను మరియు యువత పాత్రను వివరిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రెడ్ క్రాస్ అనేది కేవలం ఒక జిల్లాకో, రాష్ట్రానికో పరిమితమైన సంస్థ కాదన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద సేవా సంస్థ అని ఆయన కొనియాడారు. సింగపూర్, యూరప్, అమెరికా ఇలా ఎక్కడికి వెళ్లినా రెడ్ క్రాస్ తన సేవల ద్వారా ప్రజల మన్ననలు పొందుతోందని గుర్తు చేశారు. తుపాన్లు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు సామాన్యులకు అండగా నిలబడేది రెడ్ క్రాస్ వాలంటీర్లేనని గుర్తు చేశారు. విపత్తు నిర్వహణ అంటేనే రెడ్ క్రాస్ అనే స్థాయికి సంస్థ ఎదిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై. డి రామారావు గారు స్టేట్ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ బివిఎస్ కుమార్ పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కే యం ఎన్ వి శ్రీనివాస గుప్తా , ట్రెజరర్ డాక్టర్ నంద్యాల రాంప్రసాద్ రెడ్డి , సెక్రటరీ డాక్టర్ చంద్రశేఖర్ , మేనేజింగ్



కమిటీ మెంబర్ బత్తుల మురళి , మరియు రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి వచ్చిన యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లకు ఈ శిబిరం ద్వారా నాయకత్వ లక్షణాలు, మరియు సేవా దృక్పథాన్ని అలవర్చడమే తమ ప్రధాన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులతో పోలిస్తే, రెడ్ క్రాస్ ద్వారా అత్యంత నాణ్యమైన, కల్తీ లేని రక్తాన్ని రోగులకు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతూ, రక్తం పునరుత్పత్తి కాక ఇబ్బంది పడే చిన్నపిల్లలకు రెడ్ క్రాస్ ఉచితంగా రక్తాన్ని అందిస్తూ ప్రాణదాతగా నిలుస్తోందని వివరించారు. వృద్ధాశ్రమాలు, శిశు గృహాల నిర్వహణ, అన్నదానం మరియు ఉచిత వైద్య శిబిరాల ద్వారా రెడ్ క్రాస్ సమాజంలోని ప్రతి వర్గానికి చేరువవుతోందని ఆయన పేర్కొన్నారు. సమాజం నుండి మనం ఎంతో పొందుతున్నామని, తిరిగి సమాజానికి ఎంతో కొంత ఇచ్చే క్రమంలో రెడ్ క్రాస్ ఒక అద్భుతమైన వేదిక అని శేషగిరిరావు అన్నారు. ఈ సంస్థలో భాగస్వాములైన వాలంటీర్లందరూ గర్వంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కుటుంబాల అనుబంధం..ఆత్మీయ సమ్మేళనం

## నరసరావుపేట, కర్నూలు పార్లమెంటు కూటమి ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు మంత్రి నారా లోకేష్ విందు

**గుంటూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజాప్రతినిధుల మధ్య బంధం..వారి కుటుంబాల మధ్య కూడా అనుబంధంగా ఏర్పడటానికి ఆత్మీయ సమ్మేళనం వేదికైంది. కర్నూలు, నరసరావుపేట పార్లమెంటు కూటమి ప్రజాప్రతినిధులు, కుటుంబసభ్యులకు గురువారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ విందు ఏర్పాటు చేశారు. ఆత్మీయ కలయిక ఫ్యామిలీ గెట్ టుగెదర్ ని తలపించింది. నేతల కుటుంబసభ్యులు పరస్పరం పరిచయం చేసుకున్నారు. సరదా సంభాషణలతో ఆహ్లాదకర వాతావరణంలో గడిపారు. పొలిటికల్ లైఫ్ నుంచి కాస్త రిలీఫ్ గా డిన్నర్ మీటింగ్ సాగింది. పిల్లలు ఏం చేస్తున్నారు? ఎక్కడ సెటిల్ అయ్యారంటూ లోకేష్ అడిగి తెలుసుకున్నారు. 25 ఏళ్లకు అబ్బాయిలకు పెళ్లి చేయాలని, తనకు 24 ఏళ్లకే పెళ్లయ్యిందని లోకేష్ చెప్పారు. 25 ఏళ్లకు పెళ్లి చేసుకోవాలని దేవాన్ష్ ను కూడా ఇప్పటి నుంచే ట్యూన్ చేస్తున్నానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం నేతలు తనకు ఇచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కారం అయ్యాయి? పరిశీలనలో ఏం ఉన్నాయి? ఏవి కాలేదు అనేవి తెలియజేసే నివేదికను ఆయా నేతలకు అందజేశారు. మహిళామణులకు మంగళగిరి పట్టుచీరలు పెట్టారు. విందు ముగిశాక గేటు వరకూ వెళ్లి అందరికీ ఆత్మీయ వీడ్కోలు పలికి సాగనంపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు మంత్రి టీజీ భరత్ (కర్నూలు), పివి పార్థసారధి (ఆదోని), కేఈ శ్యాంబాబు (పత్తికొండ), బొగ్గుల దస్తగిరి (కోడుమూరు), బివి జయనాగేశ్వరరెడ్డి (ఎమ్మిగనూరు), ఎమ్మెల్సీ బీటీ నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యేలు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు (వినుకొండ), భాష్యం ప్రవీణ్ (పెదకూం పాడు), పత్తిపాటి పుల్లారావు (చిలకలూరి పేట), చదలవాడ అరవింద్ బాబు (నరస రావుపేట), కన్నా లక్ష్మీ నారాయణ (సత్తెనపల్లి), యరపతినేని శ్రీనివాసరావు (గురజాల), జూలకంటి బ్రహ్మా రెడ్డి (మాచర్ల), ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కుటుంబసభ్యులతో హాజరయ్యారు.























# దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

## రూ.38 లక్షల విలువైన బంగారు,వెండి ఆభరణాలు రికవరీ

**దుగ్గిరాల మండలం ఫిబ్రవరి 26(ప్రభాతవార్త):** దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు వేర్వేరు గృహాల్లో జరిగిన దొంగతనం కేసులో దుగ్గిరాల పోలీసులు సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించి, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి,వారి నుండి రూ.37,85,955/ విలువైన బంగారు మరియు వెండి ఆభరణాలను రికవరీ చేశారు.ఈసందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుంటూరు



జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కేసు వివరాలను వెల్లడించారు.మండల కేంద్రమైన,దుగ్గిరాల బ్రాహ్మణ బజార్ ప్రాంతానికి చెందిన ఫిర్యాదుదారుడు తన కుటుంబంతో తిరుపతి వెళ్లి,ఫిబ్రవరి 20తేదీన తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు,బీరువా పగులగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించబడినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా,దుగ్గిరాల ఎస్సై వెంకట రవి కేసు నమోదు చేసి, నార్త్ డిఎస్పీ మురళీకృష్ణ పర్యవేక్షణలో, మంగళగిరి రూరల్ సీఐ ఏవి. బ్రహ్మం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి,సీసీటీవీ ఫుటేజ్,వేలిముద్రలు మరియు ఇతర సాంకేతిక ఆధారాల విశ్లేషణ ద్వారా, పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన చిప్పాడ కేదారేశ్వరరావు(40) అనే పాత నేరస్తుడు ఈ దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించారు.నిందితుడిని మంచికలపూడి అడ్డరోడ్డు వద్ద అరెస్ట్ చేశారు.అతని వద్ద నుండి రూ.16,32,455/ విలువైన 101.71 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు రూ.1,000/ నగదును స్వాధీన పరుచుకోవటం జరిగిందన్నారు.అదేవిధంగా,అతనివద్ద నుండి ఈ కేసుతో పాటు మంగళగిరి రూరల్, అత్తిలి, హనుమాన్ జంక్షన్, కైకలూరు పోలీస్ స్టేషన్లలో నమోదైన మొత్తం 5 కేసులకు సంబంధించిన సొత్తు స్వాధీన పరుచుకున్నా మన్నారు.నిందితుడు కేదారేశ్వర రావు ,గతంలో 40కు పైగా దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని,అతను చెడువ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు.

అదేవిధంగా మరొక కేసులో,దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామానికి చెందిన,మరొక ఫిర్యాదుదారుడు ఫిబ్రవరి 19వ తేదీన, కుటుంబంతో బయటకు వెళ్లిన సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి బీరువా తలుపులు తెరచి సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారని, ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, సీఐ ఏవి.బ్రహ్మంఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టగా,వేలిముద్రలు, ఫేస్ రికగ్నిషన్ సాంకేతికత,అనుమానితుల కదలికలపై నిఘా ఆధారంగా, గుంటూరు ,నెహ్రూనగర్‌కి చెందిన ఇమడాబత్తిని గోపి (38)నిందితుడిగా గుర్తించి, నిందితుడిని మంగళగిరి పట్టణంలోని షరాఫ్ బజార్ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుండి అతని వద్ద నుండి రూ.20,40,000/ విలువైన 136 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు రూ.1,11,510/ విలువైన 378 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనపరచుకోవటం జరిగిందన్నారు.నిందితుడైన గోపి,వృత్తిరీత్యా కార్పెంటరని,గతంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో నిందితుడని, అతని వద్ద నుండి బంగారు మరియు వెండి ఆభరణాలు కలిపి మొత్తం విలువ: రూ.37,85,955/గా గుర్తించటం జరిగిందన్నారు.ఈ కేసులను సమర్థవంతంగా ఛేదించిన మంగళగిరి రూరల్ సీఐ ఏవి.బ్రహ్మం, దుగ్గిరాల ఎస్సై వెంకటరవి మరియు వారి బృందాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ రకుల్ జిందాల్ మాట్లాడుతూ,గుంటూరు జిల్లాలో దొంగతనాలు, దోపిడీలు వంటి ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతోందని, నేరస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు..

# పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

**నందిగామ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రవరం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం పాఠశాలప్రధానోపాధ్యాఉలు బి అరుణ కిషోర్ అధ్యక్షతన ఘనంగా గురువారం నిర్వహించబడినది. ఈ సందర్భంగా కొండ్రకుంట విశ్వేశ్వరరావు వారి కొండ్రకుంట ఫౌండేషన్ విజయవాడ ద్వారా గోళ్ళముడి గ్రామ పెద్దలు గాలి వెంకటనారాయణ సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు పెన్నులు, పెన్సిళ్ళు, స్కేళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ ముప్పాళ్ళ జానకోటయ్య, పాఠశాల కమిటీ ఛైర్మన్ జిల్లేపల్లి నాగేశ్వరరావు వీటిని విద్యార్థులకు అందజేసినారు. బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి



ఎదగాలని హాజరైన పెద్దలందరూ విద్యార్థులను ఆశీర్వదించినారు. ప్రధానోపాధ్యాయులు కొండ్రకుంట ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అరుణ్‌కుమార్, సురేష్, బాలకృష్ణ రాజు, కళ్యాణ్ రాజు, పూర్ణ చంద్రరావు, శారద, నాగ సింధు, కవిత, కృష్ణారావు లు పాల్గొన్నారు. బత్తిన అరుణ కిషోర్, ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రవరం.

# ప్రాణాలను హరిస్తున్న గడ్డిమందును నిషేధించాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆత్మహత్యలకు కారణమవుతున్న ప్రాణాంతక గడ్డి మందు ను తక్షణమే నిషేధించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వాన్ని కోరారు.గురువారం అమరావతి లో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల జీరో అవర్ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి కీలక అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూపారాక్వాట్ ఒక గడ్డి మందు అయినప్పటికీ, ఇది"సైలెంట్ కిల్లర్‌"గా మారింది. క్షణికావేశంలో తీసుకునే ఆత్మహత్య నిర్ణయాల్లో ఈ గడ్డి మందు ప్రధాన సాధనంగా మారుతోంది. కేవలం 5 ఎంఎల్ తీసుకున్నా శరీరంలోని కీలక అవయవాలు పూర్తిగా దెబ్బతిని ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.పారాక్వాట్ సులభంగా తక్కువ ధరకే అందుబాటులో ఉండటం, దీనికి సరైన విరుగుడు లేకపోవడం వలన ఇది అత్యంత ప్రమాదకరంగా మారిందని గళ్ళా మాధవి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక క్షణిక నిర్ణయం కారణంగా ఒక కుటుంబం జీవితాంతం భరించలేని దుఃఖాన్ని ఎదుర్కొం టుందని, ఇలాంటి ప్రాణాంతక పదార్థాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పటికే కేరళ, పంజాబ్ రాష్ట్రాలు పారాక్వాట్‌ను పూర్తిగా నిషేధించాయని గుర్తుచేసిన ఎమ్మెల్యే, మన రాష్ట్రంలో కూడా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ గడ్డి మందుపై తక్షణ నిషేధం విధించాలని కోరారు.ప్రజల ప్రాణరక్షణే ప్రభుత్వ ధ్యేయంగా ఉండాలని, ఆత్మహత్యలను అరికట్టేందుకు అవగాహన



కార్యక్రమాలతో పాటు ప్రాణాంతక రసాయనాల నియంత్రణ పై స్పష్టమైన

# రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు ఆరంభమయ్యాయి!

## వైకాపా నాయకులు పచ్చల శ్యాంబాబు

**మంగళగిరి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** రాజధాని అమరావతిని అడ్డుకునే కుట్రలు ఆరంభమయ్యాయని ప్రముఖ న్యాయవాది, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చల శ్యాంబాబు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కె) ఇటీవల ప్రెస్ మీట్ నిర్వహించి చేసిన వ్యాఖ్యలను శ్యాంబాబు తీవ్రంగా ఖండించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు మ్యాప్ లో మార్పులు,



చేర్పులు చేశారంటూ ఆర్కే వ్యాఖ్యానించటం సరికాదని అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అభివృద్ధి ఆగిపోవాలి నిధులు రాకూడదు అన్న కుట్రతో ఆళ్ల రామకృష్ణారెడ్డి అండ్ కో బ్యాచ్ పయనమైందని విమర్శించారు. లింగమనేని రమేష్ కు లబ్ధి చేకూరేలా ఇన్నర్ రింగ్ రోడ్డు ను ఆయన భూముల ప్రక్క నుండి వెళ్లేలా చంద్రబాబు డిజైన్ చేశారని ఆర్కే ఆరోపించారని శ్యాంబాబు అన్నారు. మరి అలాగైతే 2019 నుంచి 2024 వరకు జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నారు మీరు మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు పేదల భూముల్లో నుంచి వెళ్లేలా ఎందుకు ప్రయత్నించలేదు అన్న అంటూ ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి అభివృద్ధి అద్భుతంగా జరుగుతోందని ఇందులో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. తాను వైఎస్ఆర్సిపి లోనే ఉన్నానని అదే పార్టీలో కొనసాగుతానని పార్టీ మారబోనని స్పష్టం చేశారు.

# అంగరంగ వైభవంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 27వ వార్షికోత్సవాలు

గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 26,ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ గుంటూరు తిరుమలగా ప్రసిద్ధిగాంచిన శ్రీపద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి.తొలిరోజు సభా కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి బొర్రరా ఉమామహేశ్వరరావు తొలి పలుకులతో ప్రారంభించారు.నోరి నారాయణమూర్తి సభాధ్యక్షతలో సభకు విచ్చేసిన ఆనందాశ్రమం గండిపాలెం శ్రీప్రసన్నానందగిరి స్వామి,శ్రీశృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠం పీఠాధిపతులు శ్రీగంభీరానంద భారతీమహాస్వామి,శ్రీ వశిష్టాశ్రమ ఉత్తర పీఠాధిపతి మరియు సర్వాధికార ప్రతినిధి కారంచేడు శ్రీ విశ్వంభరానందగిరిస్వామిలను అనుగ్రహభాషకులుగా ఆహ్వానించారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నిమ్మల శేషయ్య,బిజెపి నాయకురాలు యడ్లపాటి స్వరూపారాణి,ప్రముఖ విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య,మానం శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఉ పన్యాసకులుగా డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంభీరానంద భారతీమహాస్వామి మాట్లాడుతూ బ్రహ్మోత్సవ విశేషాలను చక్కటి సరళమైన భాషలో వివరించారు.దేహమే దేవాలయమని మనం గుర్తించాలన్నారు. ఆలయ ప్రదక్షిణ విశేషాలను,ధ్వజస్థంభ విశిష్టతను వివరించారు.తొలుత స్వాగతాంజలి,నాదస్వరం అనంతరం పరాశరం కృష్ణప్రసాద్ బృందం విష్వక్సేన ఆరాధన,పుణ్యాహవచనం,అజస్ర దీపారాధన,దీక్షాధారణ, ఋత్విగ్వరణ, వాస్తుపూజ,అగ్ని ప్రతిష్ఠాపన,గరుడ ఆరాధన,ధ్వజారోహణ, అంకురారోపణ, నీరాజనం,మంత్రపుష్పం,తీర్థప్రసాద వినియోగం జరిగింది.భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ,ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు,సూర్యదేవర వెంకటేశ్వరరావు,సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు,సభ్యులు కన్నెగంటి బుచ్చయ్యాచౌదరి,అడుసుమల్లి సుధాకర్, బండారు సాంబశివరావు ,తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# వాహన తనిఖీలలో ట్రైనీ ఎస్సై అత్యుత్సాహం

## వాహన చోదకులపై పరుషపదజాలం

**విజయవాడ, ఫిబ్రవరి 26(ప్రభాతవార్త) :** స్థానిక సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా ఓ ట్రైనీ ఎస్సై ప్రవర్తించిన తీరు పట్ల వాహనచోదకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. భద్రత తనిఖీలలో భాగంగా బుధవారం రాత్రి స్థానిక అలంకార్ సెంటర్లో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల రికార్డులు పరిశీలించడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీలు చేపట్టారు. కాగా, ఈ సందర్భంగా సాధారణ దుస్తులలో ఉన్న శిక్షణ ఎస్సై వాహన చోదకుల పట్ల పరుషపదజాలం ఉపయోగించడం పట్ల పలువురు వాహన చోదకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన ఒకరిద్దరిపై ఆ ట్రైనీ ఎస్సై చేయి చేసుకున్నట్లు వాపోతున్నారు.

# విజయవాడలో ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు

**విజయవాడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** త్వరిత వాణిజ్య సేవ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌ను విజయవాడకు విస్తరిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ప్రాంతీయ ప్రతినిధి కునాల్ గుప్తా తెలిపారు. రోజువారీ నిత్యావసర వస్తువులను అందించడానికి మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు (ఎంఎఫ్‌సి లు) ప్రస్తుతం ఆటో నగర్ మరియు గవర్నర్ పేట , తాడేపల్లిలో వున్నాయని, విజయవాడ అంతటా వెయ్యికి పైగా స్థానిక విక్రేతలు, రైతుఉత్పత్తి సంస్థలతో (ఎఫ్పిఒలు) కలిసి పనిచేస్తుందన్నారు.

# సరికొత్త ప్యాకేజింగ్‌తో హిమాలయా బేబీ కేర్

**విజయవాడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** రాబోయే ఐదేళ్లలో 500 టన్నుల ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని లక్ష్యంతో సరికొత్త ప్యాకేజింగ్ డిజైన్ పరిచయం చేస్తున్నట్లు హిమాలయా బేబీ కేర్ డైరెక్టర్ ఎన్వీ చక్రవర్తి తెలిపారు. దీనికోసం ఒక పేరెంట్స్ మీట్ నేపథ్యంగా డిజిటల్ ఫిల్మ్ యాడ్ రూపొందించామన్నారు.

# తిరువూరు అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చ

**తిరువూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** సీఎం క్యాంపు కార్యాలయంలో త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో జరగబోయే ఎన్టీఆర్ జిల్లా ప్రజా ప్రతినిధుల మరియు అధికారుల సమావేశం సందర్భంగా గురువారం విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశాతో తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సమావేశమై తిరువూరు నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు.



# గ్రంథాలయంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు అయ్యదేవర కాళేశ్వరరావు వర్ధంతి వేడుక

**నందిగామ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు శ్రీ అయ్య దేవర కాళేశ్వరరావు గారి 64వ వర్ధంతి కార్యక్రమాన్ని నందిగామ శాఖ గ్రంథాలయం నందు ఈ రోజు ఘనంగా నిర్వహించడం అయినది.



కాళేశ్వరరావు గారి చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాలవేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు అలిగెల కోటేశ్వరరావు, గోపి, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కాళేశ్వరం చిత్రపటానికి పుష్పాలు అర్పించి నివాళులు అర్పించడమైనది. గ్రంథాలయ అధికారి రామచంద్రుడు మాట్లాడుతూ అయ్యదేవర కాళేశ్వరరావు మన నందిగామ గ్రామంలోనే లక్ష్మయ్య, వరలక్ష్మి దంపతులకు 1881 జనవరి 22న జన్మించారని, ఉన్నత విద్యను మచిలీపట్నం నోబుల్ కళాశాలలో పూర్తిచేశారని, నోబుల్ కళాశాలలోనే రెండు సంవత్సరాలు ఉపాధ్యాయుడుగా పనిచేశారని, ఎల్.ఎల్.బి మద్రాసులో పూర్తి చేసి విజయవాడలో లాయర్‌గా పనిచేసినారని, గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర ఉద్యమంలోనూ హోమ్రూల్ ఉద్యమంలోనూ బెంగాల్ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు అని ఈయన జైలు జీవితాన్ని రెండు సంవత్సరాలు గడిపినారని, ఆ సమయంలో నవ్యాంధ్ర నా జీవిత కథ పుస్తకాన్ని , ఫ్రెంచ్ విప్లవ చరిత్రను, ఈజిప్ట్ చరిత్ర, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర చైనా జాతీయ ఉద్యమ చరిత్ర పుస్తకాలను రచించినారని 1955లో విజయవాడలోని దక్షిణ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మొదటి స్పీకర్గా నిర్వహించారని 1962లో రెండోసారి శాసనసభకకు పోటీ చేసి ఫలితాలు ప్రకటించే లోగో 1962 ఫిబ్రవరి 26న మరణించారని, రెండోసారి ఎలక్షన్‌లో కూడా కాళేశ్వరం గారు విజయాన్ని సాధించారు. విజయవాడలో రెండున్నర ఎకరాలు స్థలాల్ని వ్యాపార దుకాణాలకు ఇచ్చినందుకు ఈయన పేరు మీద 1939 లో టంగుటూరు ప్రకాశం పంతులుగారు కాళేశ్వరం మార్కెట్‌గా నామకరణ చేసి ప్రారంభించినారు. ఇప్పుడు కాళేశ్వరం మార్కెట్లో 500 దుకాణాలు ఉన్నాయని, గ్రంథాల అధికారి తెలియజేశారు.

# విద్యార్థులకు కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌పై అవగాహన

**విజయవాడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** విద్యార్థులకు ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాల ఆధ్వర్యంలో గురువారం కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ఎల్‌వీపీఈఐ కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్ కన్సల్టెంట్ నేత్ర వైద్యులు డా అడేలైన్ షోన లస్రాడో మాట్లాడుతూ పరీక్షలప్పుడు విద్యార్థులు స్మార్ట్ బోర్డులు చూడటం, అర్ధరాత్రి వరకు చదవటం, మాక్ టెస్టులు వ్రాయటం, ఒక స్క్రీన్‌పై నోట్స్ మరియు మరొక స్క్రీన్‌పై వీడియోలు చూడటం వల్ల వచ్చే సీవీఎస్ వంటి నేత్ర సమస్యలనుండి కాపాడ్డానికి ప్రతి 20 నిమిషాలకు, 20 అడుగుల దూరంలోని దాన్ని 20 సెకన్ల పాటు చూస్తే కంటి రక్షణ సాధ్యమన్నారు.

# ఖాళీ స్థలాల పన్ను చెల్లించని యజమానుల స్థలాలు కార్పొరేషన్ స్వాధీనం

**-పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చిన స్పందించని యజమానుల స్థలాల్లో బకాయిల వివరాల బోర్డులో ఏర్పాటు..**

**- ఏపీ మున్సిపల్ రెవెన్యూ వసుళ్ళ చట్టం ప్రకారం కఠిన చర్యలు..**

**నగర కమిషనర్ కే మయూర్ అశోక్**

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 26, (ప్రభాతవార్త) : గుంటూరు నగరంలోని కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల పన్ను బకాయిలు చెల్లించని యజమానుల స్థలాలను కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవటం జరుగుతుందని నగర కమిషనర్ కే మయూర్ అశోక్ వెల్లడించారు. అనేకమంది ఖాళీ స్థలాల యజమానులకు పన్ను బకాయిలకు సంబంధించి నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోగా పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యం వహించిన యజమానుల స్థలాలలో కమిషనర్ ఆదేశాల మేరకు జీఎంసి రెవెన్యూ విభాగం అధికారులు ఆ స్థలానికి సంబంధించి బకాయిలు ఉన్న పూర్తి వివరాలతో గురువారం బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్ సి పన్ను బకాయిలు చెల్లించకపోయిన, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించని యజమానులపై ఏపీ మున్సిపల్ రెవెన్యూ వసూళ్ల చట్టం ప్రకారం



కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు. నగరపాలక సంస్థకు దీర్ఘకాలంగా రూ. 80 కోట్లకు పైగా ఖాళీ స్థలాలకు చెందిన యజమానులు పన్ను బకాయిల వసూళ్లకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని వెల్లడించారు. ఇప్పటికే రెవిన్యూ ఇన్స్పెక్టర్ ల వారీగా పన్నుబకాయలు అధికంగా ఉన్న టాప్ టెన్ యజమానులను గుర్తించి వారు చెల్లించాల్సిన పన్ను బకాయిలకు సంబంధించిన పూర్తి వివరాలతో ఆ స్థలాలలో ఫ్లెక్సీ బోర్డులు ప్రచారం చేసేలా సుమారు 100కు పైగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ వసూళ్ల చట్టం ప్రకారం స్పందించకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా కార్పొరేషన్ కు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తి పన్ను రూ.132 కోట్ల రూపాయల పైగా బకాయిలు ఉన్నాయని, ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులతో పలు సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రైవేట్ ఆస్తులకు సంబంధించి బకాయిదారులకు డిమాండ్ నోటీసులు, స్లిప్పులు పంపిణీ చేశామని వివరించారు. కార్పొరేషన్కు పన్ను బకాయిలు చెల్లించని వారి ఇంటి గోడలపై బకాయిల వివరాలు ప్రచురించడం జరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ మార్చి నెల నాటికల్లా నన్ను బకాయిలు చెల్లించాలని సూచించారు. అప్పటిలోపు పన్ను బకాయి చెల్లించకపోతే 25 అపరాధ రుసుముతో జమ తో పొన్ను బకాయి భారం అయ్యే పరిస్థితి ఎదురవుతుందని తెలిపారు. పన్నులు చెల్లించుకోవడానికి కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాల్లో సెలవు రోజుల్లో సైతం క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని వివరించారు.

# సైన్స్ సమగ్ర మహోత్సవ్ విద్యార్థులకు నేడు పురస్కారాల పంపిణీ

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 26(ప్రభాతవార్త ) :** రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు ఒక గొప్ప వేదికగా నిలిచిన సైన్స్ సమగ్ర మహోత్సవ్ 2ò26 ముగింపు కార్యక్రమం ఫిబ్రవరి 27వ తేదీన విజయవాడ గాంధీనగర్ లోని చిట్టూరి హైస్కూలు ఆవరణలో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హాజరై రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. విజేతలకు ప్రతిభా పురస్కారాలు, సర్టిఫికెట్లు, ప్రత్యేక మెంటార్షిప్ అవకాశాలు మరియు సమ్మర్ ఇన్నోవేషన్ క్యాంప్లో ప్రవేశం, పాల్గొన్న ప్రతి విద్యార్థికి డిజిటల్ సర్టిఫికెట్ ప్రదానం వంటివి మంత్రి చేతులు మీదుగా ప్రధానం చేయనున్నారు.

ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 29,435 మంది విద్యార్థులు, 12,528 జట్లు మరియు 4,118 పాఠశాలలు పాల్గొన్నారు. తరగతి గదులు, ఆవిష్కరణ ప్రయోగశాలలుగా మారి, ముడి పదార్థం సృజనాత్మక పరిష్కారాలుగా రూపాంతరం చెందాయి. ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది విద్యార్థులు తమ ఆలోచనలను ప్రయోగాత్మక నమూనాలుగా మార్చి సృజనాత్మకతను ప్రదర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించడం, పాఠశాల స్థాయిలో ప్రాజెక్ట్ ల తయారీ, మండల మరియు జిల్లా స్థాయిలో ఎంపికలు, తదనంతరం రాష్ట్ర స్థాయి మూల్యాంకన, ప్రాజెక్టులు ఆవిష్కరణ, శాస్త్రీయస్పష్టత, ఆచరణ, సమిష్టి కృషి మరియు పర్యావరణహిత దృక్పథం వంటి ప్రమాణాల ఆధారంగా నిపుణుల జ్యూరీ ద్వారా అత్యంత పారదర్శకంగా 4 దశల్లో ఈ ఎంపికలు జరిగాయి.

# 31వ రోజు డ్రగ్స్‌పై దండయాత్ర

**చందర్లపాడు ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** చందర్లపాడు పరిధిలోని ముప్పాళ్లగ్రామ ప్రజలు అపారమైన ప్రేమాభిమానాలతో డ్రగ్స్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఈ సైకిల్ యాత్ర కు ఘన స్వాగతం పలికారు.



గ్రామం మొత్తం ఒకే స్వరంతో డ్రగ్స్‌కు నో అని నినాదిస్తూ సైకిల్ యాత్రకు పోలీసులతో కలిపి పోరాటానికి భుజం కలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి తిలక్, సిఐ చవాన్, ఎస్సై ధర్మరాజు మరియు సిబ్బంది రాజకీయ నాయకులు కోట వీరబాబు, మేకల సుధాకర్, వాసిరెడ్డి ప్రసాద్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామ కోటి మహోత్సవాలు

**నందిగామ ఫిబ్రవరి 26 ప్రభాతవార్త :** నందిగామ పట్టణంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 73వ శ్రీరామ కోటి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు, ఆలయ ఈవో నారాయణ నరసింహమూర్తి సీతారామనామ సంకీర్తన సంఘం సభ్యుల దొడ్డ నాగేశ్వరరావు దివ్వెల మురళి చింతల పూడి రమణా రావు ఊటుకూరి నత్యనారాయణ ఆధ్వర్యంలో ఆరవ రోజు గురువారం రోహితులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదికపై



శివపార్వతుల దివ్య కళ్యాణం శివపార్వతుల దివ్య కళ్యాణం కనుల పండుగ జరిగింది. ఆది దంపతుల కళ్యాణ మహోత్సవంలో నందిగామ పట్టణానికి చెందిన సముద్రాల యజ్ఞ నారాయణ పద్మావతి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెనాలి పట్టణానికి చెందిన నోరి నారాయణమూర్తి సుందరాకాండ కథాగానం, ఒంగోలు పట్టణానికి చెందిన వేదవతి భాగవతారిణీ సీతారామ కళ్యాణం హరికథా గానం కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శివపార్వతుల ప్రత్యేక సెట్టింగ్ చూపరులను ఆకట్టుకుంది.

# విజయవాడలో పీఎంజే జువెల్స్ గ్రాండ్

## "ది వరల్డ్స్ బిగ్గెస్ట్ జ్యువలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

**విజయవాడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** పీఎంజే జువెల్స్ గ్రాండ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే "హాఫ్‌శారీ వెడ్డింగ్స్ అండ్ సెలబ్రేషన్స్" పేరిట "ది వరల్డ్స్ బిగ్గెస్ట్ జ్యువలరీ ఎగ్జిబిషన్" జ్యువెలరీ ప్రదర్శనను సినీ నటి లయ గురువారం ప్రారంభించారు. విజయవాడలో తాజ్ వివంతా హోటల్‌లో ఈనెల 28 వరకు జరిగే ఎగ్జిబిషన్లో వివాహాలు, పండుగలకు డైమండ్ కలెక్షన్స్, రంగురాళ్ల



కళాఖండాలు మరియు సంప్రదాయ పోల్కీ ఆభరణాలతో పాటు బ్రాండ్ అంబాసిడర్ సితార ఘట్టమనేని పేరిట రూపొందించిన సితార కలెక్షన్ ప్రత్యేక ఆకర్షణగా వుంటాయని నిర్వాహకులు హైదర్ అలీ, మోహన్ కృష్ణ, నటి లయలు తెలిపారు.

# రంజాన్ సమయంలో ప్రైవేట్ సంస్థ ఉద్యోగులకు

## 1గంట ముందు వెసులుబాటు కల్పించాలి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ రంజాన్ నెల ఉపవాస (రోజా) దీక్షాపరులకు ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగులకు ఒక గంట ముందే ఇళ్లకు వెళ్లే వెసులుబాటును ప్రయివేటు కార్యాలయాల్లో ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలని తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లోని ప్రైవేట్ ముస్లీం ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ విద్యా సంస్థల్లో సాయంత్రం ఒక గంట ముందు ఉద్యోగులకు వెసులుబాటుతో రోజుకు తెల్లవారుజామున 4.30 నుండి సాయంత్రం 6.30గంటల వరకు ప్రతి రోజు 14 గంటల పాటు రోజా నియమాలు పాటిస్తూ ఎంతో కఠోర నియమాలు మంచినీరు కూడా తాగకుండా ఉపవాసాలు పాటిస్తారు. అందువల్ల ప్రయివేటు ఉద్యోగులకు ఈ ప్రభుత్వ నిబంధన వర్తించకపోవడంతో అనేకమంది ఉపవాస దీక్షాపరులు సాయంత్రం ఇఫ్తార్ విరమణ సమయంలో వారి అవస్థలు వర్ణనాతీతం అందువల్ల ఈ ప్రయివేటు కార్యాలయాల్లో ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఒక గంట ముందు వెసులుబాటు సౌకర్యం ఆయా సంస్థల యజమానులు కల్పించే విధంగా తగు ఆదేశాలు జారీ చేసి అమలు చేసే విధంగా కృషి చేయాలని ముస్లీంలు ముస్లీం మతపెద్దలు ముతవల్లీలు రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

